అస్తవ్యస్త పారిశుద్ధ్యంతో అవస్థలు

- తిరుమలగిరిలోని 4వ వార్డులో అధ్వానంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థ
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- దోమలు, పందుల బెడదతో ఆందోళన చెందుతున్న కాలనీవాసులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లో (4వ వార్డులో) పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ వార్డులో అండర్ డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడ పడితే అక్కడ నిలుస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు తెలుపుతున్నారు. మురుగు నీటి ప్రాంతాలు పందులు, దోమలకు ఆవాసంగా మారాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్ల పైకి వెళ్లాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల వల్ల జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఆదర్శనగర్‌లో అధ్వానంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు అంటున్నారు. మున్సిపాలిటీ ఏర్పడితే ఎంతో అభివృద్ధి చెందుతుందని అనుకుంటే ఇంకా అస్తవ్యస్తంగా మారిందని తెలుపుతున్నారు. కాలనీలో ఎన్నో సమస్యలు నెలకొన్నాయని, డ్రెయినేజీ వ్యవస్థతో పాటు పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయని వాపోతున్నారు. కొద్దిపాటి వర్షానికే నీళ్లన్నీ రోడ్లపై నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



4వ వార్డులో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

డ్రెయినేజీ వ్యవస్థ సరిచేయాలి

ఆదర్శనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డు పైనే నిలుస్తోంది. మురుగు నీటిలో దోమలు, పందులు తిరుగుతున్నాయి. దుర్గంధం వెదజల్లుతుంది. డ్రెయినేజీ వ్యవస్థ సరి చేయాలి.

– యాకయ్య, 4వ వార్డు, తిరుమలగిరి

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

ఆదర్శనగర్‌లో అన్నీ సమస్యలే నెలకొన్నాయి. సమస్యల పరిష్కారం కోసం గతంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పినా పట్టింకోలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

– నరేష్, 4వ వార్డు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



నాగారంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నాగారం : మండలంలోని నాగారం, వర్ధమానుకోట, డి.కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర పారామిలటరీ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక సీఐ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం కొరకు పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీసుశాఖ కృషి చేస్తోందన్నారు. మండలంలోని వర్ధమానుకోట, డి.కొత్తపల్లి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పి.వెంకట్ రెడ్డి, పారామిలటరీ దళాలు, స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి గుడికి శంకుస్థాపన

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి నూతన గుడి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సొసైటీ సంఘం నాయకులు పులుగుజ్జ రామచంద్రు, పులుగుజ్జ నాగయ్య, బీసుపెద్ద వీరన్న, బీసుచిన్న వీరన్న, పులుగుజ్జ మహేందర్, రామనర్సు, బుచ్చిరాములు, యాకయ్య, ఉప్పలయ్య, వీరయ్య పాల్గొన్నారు.



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



మద్దిరాలలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

మద్దిరాల : అర్హులైన నిరుపేదలు గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్దర్ హష్మి జయంతి వేడుకలు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో శుక్రవారం వీధి నాటకాల సృష్టికర్త సప్దర్ హష్మి జయంతి వేడుకలను పూలే, అంబేద్కర్ ఆశయ పోరాటసమితి, సామాజిక తెలంగాణ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సప్దర్‌హష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే అంబేద్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య మాట్లాడారు. ఢిల్లీలోని ఘజియాబాద్ సెంటర్‌లో 'హల్లాబోల్' వీధినాటికను ప్రదర్శిస్తుండగా కొంతమంది దుండగులచే హత్యచేయబడిన ప్రజాగాయకుడు సప్దర్ హష్మి అని తెలిపారు. అతడి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా నాయకుడు దడిపల్లి వెంకట్, ప్రజా ఉద్యమ కళాకారుడు మచ్చ నర్సయ్య, నిమ్మల మల్లయ్య, కొరపిడత లక్ష్మయ్య, నోముల భద్రయ్య, కోటమర్తి ఇస్తారి, పున్న రాములు, అక్కెనపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణానికి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ గరిడేపల్లి వద్ద లీకేజీ అవడంతో దాని మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని 29గ్రామ పంచాయతీలకు రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటికి అంతరాయం ఏర్పడుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవంతిపురం నుంచి ఇమాంపేట ప్లాంట్‌కు వచ్చే రా వాటర్ పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ గరిడేపల్లి వద్ద లీకేజీకి గురైన కారణంగా 95ఎంఎల్‌డీ ఇమాంపేట నీటిశుద్ధి కేంద్రానికి షట్‌డౌన్ తీసుకుంటున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుమలగిరి : వెలిశాల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతుల కారణంగా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మద్దిరాల : ముకుందాపురంలో 33కేవీ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలను తొలగిస్తున్నందున ముకుందాపురం, చందుపట్ల, జి.కొత్తపల్లి, మామిండ్లమడవ, పీర్యానాయక్ తండా, తూర్పు తండాలలో శనివారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సురేందర్ నాయక్ శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

మజ్జిగ పంపిణీ

అర్వపల్లి : వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చుటకు రేఖ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. మండల పరిధిలోని అడివెంల క్రాస్‌రోడ్డు వద్ద రేఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆ చలివేంద్రంలో శుక్రవారం బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిపద్మ పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న రేఖ

న్యాయశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి

తుంగతుర్తి : న్యాయవాదులు న్యాయ శాస్త్రం పట్ల అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ బార్ కౌన్సిల్ మెంబర్ దుస్స జనార్దన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులను కలిసి మాట్లాడారు. సెంట్రల్ గవర్నమెంట్ చేసిన పలు యాక్టులకు సంబంధించిన న్యాయ శాస్త్ర పుస్తకాలను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయనను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జిల్లా కుమారస్వామి, కోశాధికారి బానోతు ప్రతాప్, సహాయ కార్యదర్శి మల్లెపాక రవికుమార్, కార్యవర్గ సభ్యులు వల్లపు అనిల్ కుమార్, వంగాల నాగరాజు, సీనియర్ న్యాయవాదులు కుంభం రణధీర్, టి.హరి చరణ్, జిలకర చంద్రమౌళి, మహేష్ పాల్గొన్నారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న హైదరాబాద్ బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్దన్

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



తుంగతుర్తిలోని ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తుంగతుర్తి : ఎండాకాలంలో వచ్చే వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి సముద్రాల సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వసతి గృహ విద్యార్థినులకు వడదెబ్బపై అవగాహన కల్పించి మాట్లాడారు. వడదెబ్బ తగిలిన వారి శరీరంలో నీరు, ఖనిజ లవణాలు తగ్గుతాయన్నారు. వడదెబ్బకు గురైతే తీవ్ర జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వడదెబ్బ చిన్న వయసులో ఉన్న పిల్లలకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండడానికి ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలు, ఎండలో పనిచేసే వారు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే పని చేయాలని అన్నారు. తలపై రక్షణకు రుమాలు, టోపీ ధరించాలని అన్నారు. ఆరోగ్య కార్యకర్త, ఆశా వర్కర్ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు లభిస్తాయని తెలిపారు. ఓఆర్ఎస్, నిమ్మకాయ రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ పానీయాలు తరచుగా తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమయ్య, లకావత్ యాదగిరి, ఆరోగ్య సిబ్బంది సరిత, కళ్యాణి, వసంత, మంజుల పాల్గొన్నారు.

సీపీఎంను గెలిపించాలని ప్రచారం



జాజిరెడ్డిగూడెం మార్కెట్ యార్డులో ప్రచారం చేస్తున్న మల్లు లక్ష్మి, సీపీఎం నాయకులు

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి ఓటర్లను కోరారు. సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ గెలుపు కోసం శుక్రవారం జాజిరెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సీపీఎంను గెలిపించాలన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలలో గతంలో సీపీఎం ఎమ్మెల్యేలు గెలిచారని చెప్పారు. ఈసారి భువనగిరి గడ్డపై ఎర్రజెండా ఎగరడం ఖాయమన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులకు ఈ ప్రాంతంపై ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, కొప్పుల రజిత, కొప్పోజు సరోజ, శిగ వెంకన్న, కొమ్ము విజయ్‌కుమార్, శ్రీను, శ్రీకాంత్, వినయ్‌కుమార్, శేఖర్, బాలయ్య, జాన్, యల్లమ్మ పాల్గొన్నారు.

జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



ఏపూరులో జార్జిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, మతోన్మాదాన్ని ఓడించడమే వారికి నిజమైన నివాళులని పీడీఎస్‌యూ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ అన్నారు. శుక్రవారం జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఏపూరు గ్రామంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. కుల, మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మతోన్మాదంతో కేంద్రంలో బీజేపీ అధికారాన్ని చెలాయిస్తూ ప్రజల మధ్య కుల, మత విభజన రేఖలు గీస్తోందని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరించి పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మార్చాలని చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రహీం, వంశీ, గణేష్, వేణు, వెంకీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ ఆవరణే క్రీడా ప్రాంగణం !



దేవాలయం ఎదుట క్రికెట్ ఆడుతున్న యువకులు

అర్వపల్లి : రెండు జాతీయ రహదారులకు ప్రధాన కూడలి అయిన అర్వపల్లిలో క్రీడా స్టేడియం లేక క్రీడాకారులు, యువకులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇక్కడ మినీ క్రీడా స్టేడియం ఏర్పాటు చేస్తామనే హామీ ఇంతవరకు నెరవేరలేదు. దీంతో స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఆవరణలోనే క్రీడాకారులు, యువకులు క్రికెట్, ఇతర క్రీడలు ఆడుతున్నారు. ఈ ఆలయ స్థలం చిన్నదిగా ఉండటం, తరచూ భక్తులు వస్తుండటం, ఇక్కడే పాఠశాల ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం కేవలం బోర్డుకే పరిమితమైంది. అర్వపల్లిలో మినీ క్రీడా స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఇసుక డంప్ సీజ్

నాగారం : ఫణిగిరి దుర్గాభవానీ కంకర మిల్లులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఆయనతో పాటు పోలీసుసిబ్బంది ఎల్లయ్య, నారాయణరెడ్డి, వీరునాయక్ తదితరులు ఉన్నారు.

భువనగిరిలో భారీ మెజార్టీకి కృషి చేయాలి

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి లక్ష ఓట్ల మెజార్టీ సాధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని స్థానిక శాసనసభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి లక్ష ఓట్ల మెజార్టీ వచ్చే విధంగా కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని సూచించారు. ఈ నెల 14న తిరుమలగిరిలో తుంగతుర్తి నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారని తెలిపారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి వివరించాలన్నారు. ఈ సమావేశంలో తుంగతుర్తి మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ అనసూయ, మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ కవిత లక్ష్మీనరసింహారెడ్డి, జిల్లా నాయకులు రేతినేని శ్రీనివాసరావు, ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రామ్మూర్తి, సంకినేని గోవర్ధన్ రావు, మాధవరావు, మద్దిరాల మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, తుంగతుర్తి పట్టణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, 9 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పాలకుర్తి రాజయ్య, పెద్దబోయిన అజయ్, వెంకన్న, శంకర్, గంగరాజు యాదవ్ పాల్గొన్నారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన సుమారు 150 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే తుంగతుర్తి మండల పరిధిలోని కేశవపురం మాజీ సర్పంచ్ మిరియాల అనిత జనార్దన్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే మందుల సామేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో తుంగతుర్తి మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ అనసూయ, మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ కవిత లక్ష్మీనరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న వారితో ఎమ్మెల్యే

మృతుల కుటుంబాలకు పరామర్శ



పెన్‌పహాడ్ : విజయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్డీఆర్



ఆత్మకూర్ (ఎస్) : సంజీవరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఆర్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన గుండు లక్ష్మమ్మ, అనంతారం గ్రామానికి చెందిన మామిడి లక్ష్మమ్మ, నల్లగంతుల విజయ ఇటీవల మృతి చెందారు. దీంతో శుక్రవారం మృతుల కుటుంబాలను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిలు పరామర్శించారు.మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, గజ్జెల సైదిరెడ్డి, జానిమియా, మామిడి శ్రీను, రవి, షేక్ మధార్, మైసయ్య, వెంకన్న, రాజు, శివ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని పాతసూర్యాపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మునుగు సంజీవరెడ్డి మృతదేహానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, సామ మల్లారెడ్డి, ముస్కు రామచంద్ర రెడ్డి, వెంకటరెడ్డి, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, జాటోత్ రాజేష్ నాయక్, మద్ది సుధాకర్ రెడ్డి, జమండ్ల సత్యనారాయణ రెడ్డి, గోపగాని మల్లయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



అనంతారంలో తేమ శాతం పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు



అర్వపల్లిలో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఏపీఎం

తిరుమలగిరి : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తిరుమలగిరి మండల వ్యవసాయాధికారి డి.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం అనంతారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని 17 శాతం తేమ ఉండేట్లు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సైదయ్య, ఏఈఓలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, భాస్కర్, విజయ్, జయమ్మ, దేశగాని శ్రీను, స్వామి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం వలిశెట్టి మల్లేష్ కోరారు. శుక్రవారం అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం తదితర గ్రామాలలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు ధాన్యం ఆరబెట్టి, శుభ్రం చేసుకొని 17 శాతం వరకు తేమ ఉండేలా తేవాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర దక్కాలంటే రైతులు నిబంధనల ప్రకారం ధాన్యం తేవాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏ కృష్ణకుమారి, సంఘబంధం అధ్యక్షురాలు సునీత పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం విగ్రహాలు, ధ్వజస్తంభ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. మండల పరిధిలోని పొట్లపహాడ్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠ మహేశ్వర సురమాంబ దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా జలాభిషేకాలు నిర్వహించారు. బోనాలు సమర్పించి పూజలు జరిపారు.

పశువైద్య శిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్ఓ కేఎస్ఎస్. పద్మ, గోపాలమిత్రలు ఆల్దాస్ లింగయ్య, సూరారపు అర్జున్, కుంభం సురేందర్, రైతులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రంలో గురుకుల పాఠశాల విద్యార్థులు

అర్వపల్లి : కోదాడ నియోజకవర్గంలోని నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైంది. దీంతో పథకం నిబంధనల ప్రకారం విద్యార్థినులకు శుక్రవారం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌరఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి విద్యార్థులకు క్షేత్ర విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రజని, సునీత, నిర్మల, నాగరాజు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

లింగయ్య మృతి తీరని లోటు

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండాల లింగయ్య మృతి పార్టీకి తీరని లోటని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగయ్య మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య, పన్నాల మల్లారెడ్డి, జటంగి గణేష్, ఇమ్మారెడ్డి రాజాబహదూర్‌రెడ్డి, బండపల్లి సాగర్, కేశవచారి, బత్తిని వెంకటేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ కోనేటి సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మృతుడి తల్లి ఉపేంద్రకు జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి శుక్రవారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మృతుడి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి, సతీష్ తల్లి ఉపేంద్రను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బిక్కునాయక్, గంగదరి శ్రీనివాస్, లూనావత్ వీరన్న, మాదం వీరారెడ్డి, వెన్నమల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

మద్దిరాల : మండల పరిదిలోని చౌళ్లతండా గ్రామ పంచాయతీ ఆవాసం రాజానాయక్ తండాలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. బాదవత్ హుస్సేన్ ఇంట్లో నిల్వ చేసిన 10లీటర్ల సారాను గుర్తించి సీజ్ చేసినట్లు చేశారు. ఎస్‌ఐ వెంట ఎస్‌బీ రవికుమార్ తదితరులు ఉన్నారు.